

చెరువులు కబ్జా!

గుడివాడ పట్టణంలో 3 చెరువుల్లో యథేచ్ఛగా ఆక్రమణలు

పర్యావరణం, భూగర్భ జలాల పరిరక్షణతో పాటు ప్రజల దాహార్తిని తీర్చేందుకు దూర దృష్టితో నాడు ఏర్పాటు చేసిన ఊరు చెరువులు ఆక్రమణలతో కుచించుకుపోతున్నాయి. ప్రజాప్రతినిధుల స్వార్థం, అధికారుల ఉదాసీన వైఖరితో రూ.కోట్ల విలువ చేసే పురపాలక సంఘం చెరువులను కొందరు అక్రమార్కులు చెర పట్టారు. గుడివాడలోని బేతవోలు, పెద్దవీధి కుమ్మరి, నాగన్న మంచినీటి చెరువులు ప్రధానంగా కబ్జాకు గురయ్యాయి.

నేటికీ కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలు

- రూ.కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతం
- చూసీచూడనట్టు వదిలేస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు





చుట్టూ ఆక్రమణలతో నాగన్నచెరువు (ఇన్‌సెట్‌లో) బేతవోలు ఊర చెరువు పరిస్థితి

ఆంధ్రజ్యోతి-గుడివాడ : గుడివాడ పట్టణంలోని బేతవోలు ఊర చెరువు 14 ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. 1970-80 కాలంలో ప్రజలు పూర్తిగా తాగునీటికి ఈ చెరువుపైనే ఆధారపడేవారు. పట్టణంలో సమ్మర్ స్టోరేజ్ చెరువులు వచ్చాక చెరువు వాడకం బాగా తగ్గింది. స్వల్ప వ్యవధిలోనే చెరువు గట్టు ఆక్రమణకు గురైంది. ప్రస్తుతం చెరువు ఎనిమిది ఎకరాల మాత్రమే ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో ఎకరం రూ.2కోట్లు పలుకుతోంది. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఇక్కడ కొత్త కొత్త నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఆక్రమణలు తొలగించి, చెరువును అభివృద్ధి పరచాలని గతంలో బేతవోలు అభివృద్ధి కమిటీ పేరుతో అనేక సందర్భాల్లో పోరాటాలు చేసి, అధికారులకు వినతిపత్రాలను సమర్పించిన వారు స్పందించిన దాఖలాలు లేవు.

కొనసాగుతున్న నిర్మాణాలు

పట్టణ నడిబొడ్డులోని పెద్దవీధి కుమ్మరి చెరువు కూడా ఆక్రమణలకు గురైంది. ఆర్.ఎస్. నెం.45లో 4.53 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు చుట్టూ ఖాళీ లేకుండా ఇళ్లు నిర్మించుకున్నారు. ఇప్పటికీ మరికొంత మంది నిర్మించుకుంటూనే ఉన్నారు. ఇళ్లలోని సెప్టిక్ ట్యాంకు పైపులైన్లు నేరుగా చెరువులోని వదిలేయడంతో నీరు కలుషితమవుతోంది. మున్సిపల్ అధికారులు మాత్రం ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు.

వ్యాపార స్థలాలుగా మార్చేస్తూ..

స్థానిక బంటుమిల్లి రోడ్డులో ఆర్.ఎస్.నెం.245/1లో దొండపాడు కాల్వకు దగ్గరగా 3.5 ఎకరాల విస్తీర్ణంలో నాగన్న చెరువు ఉంది. ఇది కూడా మూడు వైపులా ఆక్రమణకు గురైంది. వేసవిలో కొంతమంది దీన్ని పూడ్చివేసి వ్యాపారానికి అనుకూలంగా మార్చేస్తున్నారు. మరో వైపు జాతీయ రహదారి ఉండటంతో ఆక్రమణలు తక్కువగా ఉన్నాయి. ఇళ్లలోని సెప్టిక్ ట్యాంకు పైపులైన్లు నేరుగా చెరువులోకి మిగతా 6లో..

చెరువుల అభివృద్ధికి రూ.4.24 కోట్లు

బేతవోలు, నాగన్న ఊరచెరువుల అభివృద్ధికి అమృత్ 2.0 స్కీం నుంచి రూ.4.24 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఆయా చెరువులపై ఉన్న ఆక్రమణలను తొలగించి, కట్టలను పటిష్ఠ పరచి, నడక దారి, మొక్కల పెంపకం, చుట్టూ రెయిలింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఏపీ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్, పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో డీపీఆర్‌ను సిద్ధం చేశారు.



స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు బొండా, యార్లగడ్డ, మండలి, కలెక్టర్ లక్ష్మీశ

గలగలా కృష్ణమ్మ

కృష్ణాడెల్టాకు 1,000 క్యూసెక్కుల నీరు విడుదల

- తొలుత శాస్త్రోక్తంగా కృష్ణమ్మకు పూజలు
- హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

పంటల సాగుకు సమయం ఆసన్నమైంది. రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం సాగు ప్రణాళికలో భాగంగా కాల్వలకు నీటిని విడుదల చేసింది. బందరు కాల్వకు 300 క్యూసెక్కులు, రైవస్ కాల్వకు 700 క్యూసెక్కుల చొప్పున మొత్తం 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విజయవాడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): విజయవాడ, కృష్ణాజిల్లాలోని ప్రజాప్రనిధులు, ప్రాజెక్టు కమిటీల చైర్మన్లు ఆదివారం కృష్ణాడెల్టాలో పంటల సాగుకు అవసరమైన నీటిని కేఈబీ చానల్ ద్వారా విడుదల చేశారు. సాగు నీటి సలహా మండలి సమావేశంలో ఈ నెల పదో తేదీన నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. సాగుకు రైతులు సన్నద్ధం కాకపోవడంతో నీటి విడుదలను వాయిదా వేశారు. కాల్వలకు అవసరమైన నీటిని బ్యారేజ్ నుంచి దిగువకు విడుదల చేశారు. కృష్ణా తూర్పు హెడ్ రెగ్యులేటర్ వద్ద కృష్ణమ్మకు పూజలు చేశారు. అనంతరం బందరు కాల్వకు 300 క్యూసెక్కులు, రైవస్ కాల్వకు 700 క్యూసెక్కులు చొప్పున మొత్తం 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, ఎన్ఎస్ఆర్ ప్రాజెక్టు కమిటీ మిగతా 6లో..

సరిహద్దుల్లో కిక్

పెనమలూరు కేంద్రంగా గ్యాంగ్‌లు

- జిల్లా సరిహద్దుల్లో ఉంటూ వ్యవహారాలు
- వరుసగా సీటీఎఫ్‌కు చిక్కుతున్న నిందితులు
- గంజాయి కేసుల్లో ఇద్దరు, ముగ్గురు ఆ మండలం వారే



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

- బిక్కి. నరేంద్ర... కానూరు కేంద్రంగా మణికంఠ కన్‌స్ట్రక్షన్స్ పేరుతో కార్యాలయాన్ని ప్రారంభించాడు. కొంతమందిని అందులో పనిచేసే సిబ్బందిగా చూపించి ఒడిసా సరిహద్దుల నుంచి గంజాయిని రప్పించేవాడు. కార్యాలయం పై అంతస్తులో గంజాయిని నిల్వ ఉంచి బెంగళూరుకు సరఫరా చేస్తున్నాడు. అతడితోపాటు మరో నలుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారిలో ఇద్దరు పెనమలూరు మండలం పోరంకి, యనమలకుదురు గ్రామానికి చెందిన వారే. కొద్దిరోజుల క్రితం జరిగిన ఘటన ఇది.
- పెనమలూరు మండలం సనత్‌నగర్‌కు చెందిన తిరుమలశెట్టి జీవన్‌కుమార్ అలియాస్ కిన్ను బీటెక్ చదువుకుని ఖాళీ మిగతా 6లో..



రాజధాని అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు, జగన్ మీడియాపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మచిలీపట్నం లక్ష్మీటాకీసు సెంటర్ వద్ద తెలుగు మహిళలు ఆదివారం మానవహారంగా ఏర్పడి నిరసన తెలియజేశారు.



ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకునేందుకు ఆదివారం క్యూలైన్లలో పోటెత్తిన భక్తులు

అంబారుపేట-ఐతవరం బైపాస్!

హైదరాబాద్-విజయవాడ ఎన్‌హెచ్-65 విస్తరణలో..

- 12 కిలోమీటర్ల నూతన బైపాస్‌కు ప్రతిపాదన
- అంతర్భాగంగా మునేరు బ్రిడ్జి రీ అలైన్‌మెంట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): హైదరాబాద్ - విజయవాడ ఎన్‌హెచ్ - 65 ఆరు వరసల విస్తరణలో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలో సరికొత్త బైపాస్‌కు ఎన్‌హెచ్ తెలంగాణ అధికారులు ప్రతిపాదించారు. జిల్లాలో అంబారుపేట - ఐతవరం బైపాస్‌ను తెరపైకి తెచ్చారు. ఈ బైపాస్‌తో పాటుగా మునేరు నది బ్రిడ్జి రీ అలైన్‌మెంట్‌కు కూడా ప్రతిపాదించారు. ఈ నూతన బైపాస్‌కు ఎన్‌హెచ్ అధికారులు మూడు ప్రతిపాదనలు చేశారు. ఆప్షన్-1లో అంబారుపేటపై నుంచి కృష్ణానదికి సమీపిస్తూ కీసరవైపు తిరుగుతుంది. ఆప్షన్ - 2లో అంబారుపేట, ఐతవరం గ్రామాల దిగువన మున్నేరు మీద కొత్తగా ఆరులేన్ల బ్రిడ్జి నిర్మాణంతో కీసర ఎగువ ప్రాంతం వరకు తీసుకువెళతారు. ఆప్షన్ - 3లో అంబారుపేట, ఐతవరం గ్రామాలకు అత్యంత సమీపంగా కీసర వైపు తిరుగుతుంది. ఆప్షన్ - 1 అలైన్‌మెంట్‌లో 12.13 కిలోమీటర్లు, ఆప్షన్ - 2 అలైన్‌మెంట్‌లో 12 కిలోమీటర్లు, ఆప్షన్ - 3 అలైన్‌మెంట్‌లో 12.08 కిలోమీటర్ల ప్రతిపాదిత నూతన బైపాస్ వస్తుంది. ఆప్షన్-1, 2లు ప్రతిపాదిత నూతన బైపాస్ అలైన్‌మెంట్‌కు అనువుగా ఉన్నాయని సమాచారం. ఆప్షన్ - 1 అయితే రెండు వెహికల్ అండర్ పాస్‌లు, ఒక మేజర్ బ్రిడ్జి, రెండు లైట్ వెహికల్ అండర్ పాస్‌లు, నాలుగు ఎస్‌వీయూపీలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీనికి 54.78 హెక్టార్ల భూములను సేకరిస్తే సరిపోతుంది. అదే ఆప్షన్ - 2లో అయితే రెండు వెహికల్ అండర్ పాస్‌లు, ఒక మేజర్ బ్రిడ్జి, రెండు బ్రిడ్జి కమ్ అండర్ పాస్‌లు, మూడు ఎల్‌వీయూపీఎస్, మూడు ఎస్‌వీయూపీలు నిర్మించాల్సి ఉంటుంది. 71.91 హెక్టార్ల భూములు అవసరమవుతాయి.



దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనక దుర్గమ్మ దర్శనానికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పొంగళ్లు సమర్పించారు. వివిధ ఆర్జిత సేవల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అధికారులు, సిబ్బంది ముందస్తు ప్రణాళిక ప్రకారం క్యూలైన్లలో భక్తులను నియంత్రించారు. ఉదయం 6 గంటల నుంచే దర్శనం క్యూలైన్లు రద్దీగా మారాయి.



క్లోక్ రూమ్ వద్ద భక్తుల రద్దీని క్రమబద్ధీకరిస్తున్న ఈవో

భక్తుల రద్దీ రీత్యా ఉదయం 10 నుంచి అంతరాలయ దర్శనం, రూ.500లు దర్శనం టిక్కెట్ల అమ్మకాలు నిలుపుదల చేయాలని ఈవో వీకే శీనానాయక్ ఆదేశించారు. కొండపైన క్లోక్ రూమ్, మొబైల్ ఫోన్ భద్రపరిచే చోట భక్తులు పెద్ద సంఖ్యలో ఉండటంతో ఈవో రద్దీ నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వెంటనే సెక్యూరిటీ సిబ్బందిని పంపి తొక్కిసలాట లేకుండా క్రమబద్ధీకరించారు. క్లోక్ రూమ్ కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేయాలని ఈవో ఆదేశించారు. వీఐపీ దర్శనం మధ్యాహ్నం వరకు లేదని మైక్ ప్రచారం చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈవో ప్రధాన ఆలయం నుండి దుర్గాఘాట్ వరకు క్యూలైన్లు, క్లోక్ రూమ్, చెప్పుల స్టాండ్, సెల్ ఫోన్ డిపాజిట్ కౌంటర్‌లను పరిశీలించారు. కేశఖండనశాల బయట ప్రదేశం, దుర్గాఘాట్‌లోని సబ్‌వేను పరిశీలించారు. భక్తుల రద్దీని పురస్కరించుకుని తాగునీరు, అన్నప్రసాదం సత్వరం అందేలా దేవస్థానం అధికారులు తగు చర్యలు తీసుకున్నారు.



బీఆర్టీఎస్ రోడ్డుపై యోగాసనాలు వేస్తున్న అధికారులు, మహిళలు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



సత్యనారాయణపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : సరళ యోగాసనాల అభ్యసన ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర మహోత్సవాలలో భాగంగా బీఆర్టీఎస్ రోడ్డులో ఆదివారం ఐసీడీఎస్, మత్స్య శాఖ అధికారులతో కలిసి కలెక్టర్ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 45 నిమిషాల సరళ యోగాసనాలతో బీపీ, మధుమేహం, ఒత్తిడి, హార్మోన్ల అసమతుల్యం వంటి సమస్యలకు చెక్ పెట్ట వచ్చునన్నారు. రోజులో కొంత సమయం యోగాకు కేటాయించాలన్నారు. ప్రతీ ఆసనంతో ప్రత్యేక ప్రయోజనాలు ఉన్నాయని, ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మీ, మత్స్యశాఖ డీడీ చక్రపాణి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డాక్టర్ జె.సుమన్, ఆయుష్‌అధికారులు, మత్స్యశాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



యోగా ప్రాముఖ్యతను వివరిస్తున్న మంతెన సత్యనారాయణ రాజు

ఆరోగ్యాలయంలో యోగాంధ్ర

» యోగాసనాలతో ఆకట్టుకున్న నేచురోపతి విద్యార్థులు

విజయవాడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : నిస్వార్థంగా, నిర్విరామంగా చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న సుమారు 1000 మందికి ఉద్యోగాలు కల్పించి, లక్షల మందికి ఆరోగ్యాన్ని అందిస్తున్న మంచి మనసున్న వ్యక్తి మంతెన సత్యనారాయణ రాజు అని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ కొనియాడారు. మంతెన సత్యనారాయణ రాజు ఆరోగ్యాలయంలో ఈ నెల 9 నుంచి 15 వరకు నిర్వహించిన 'యోగ సమావేశ్' నిర్వహించారు. చివరి రోజైన ఆదివారం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశ ప్రధాని నరేంద్ర మోదీ తలపెట్టిన యోగ కార్యక్రమాన్ని ప్రతిరోజు ప్రతి వ్యక్తి సాధన చేయాలన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఛైర్మన్ పి.కృష్ణయ్య మాట్లాడుతూ, యోగా వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం పొందవచ్చన్నారు. రాష్ట్రాన్ని కాలుష్య రహితంగా ఉంచాలని, అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు. గోకరాజు గంగరాజు మాట్లాడుతూ, నిత్యం యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతతో పాటు భావోద్వేగాన్ని నియంత్రివచ్చన్నారు. యోగా శారీరక ఆరోగ్యాన్ని పరిరక్షించడంతో పాటు అంతర్లీన శాంతిని పెంపొందించడం, సంపూర్ణ ఆనందాన్ని ఆస్వాదించడంలో కీలక పాత్ర పోషిస్తుందని మంతెన సత్యనారాయణ రాజు అన్నారు. జీవితంలో యోగా ప్రాధాన్యతను వివరించారు. అనంతరం ఆరోగ్యాలయ డాక్టర్ల బృందం, కేర్ కాలేజీ నేచురోపతి వైద్య విద్యార్థులు యోగా విన్యాసాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంఎస్ ఆర్‌పీ సూపరింటెండెంట్ భైరి శ్రీనివాస్, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జగన్ భూతాన్ని భూస్థాపితం చేయాలి

» మంత్రి కొలుసు పార్థసారథి

» విజయవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నర్రా వాసు ప్రమాణ స్వీకారం



సభలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి, వేదికపై నర్రా వాసు, ఎమ్మెల్యే వసంత, నెట్టెం రఘురాం, కనకమేడల

గొల్లపూడి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : 2029లోనూ ఎన్డీఏ కూటమికి అధికారమే లక్ష్యంగా కూటమి కుటుంబసభ్యులందరూ ఐకమత్యంగా ఉండి జగన్మోహన్ రెడ్డి అనే భూతాన్ని శాశ్వతంగా భూస్థాపితం చేయాలని మంత్రి కొలుసు పార్థసారథి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. విజయవాడ వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్‌గా నర్రా వాసు, పాలకవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమం ఆదివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా సభలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వంలో మూడు రాజధానులను తాను, ఎమ్మెల్యే వసంత ధైర్యంగా వ్యతిరేకించామని గుర్తుచేశారు. మరో ముఖ్యఅతిథి, మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ మాట్లాడుతూ, దార్శనికుడు చంద్రబాబు లాంటి వ్యక్తి రాష్ట్రానికి ఎంతో అవసరం అన్నారు. ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ, నర్రా వాసు నిబద్ధతతో పార్టీ బలోపేతానికి పడిన కష్టానికితగ్గ ఫలితం దక్కిందన్నారు. తొలుత ఒన్ సెంటర్ నుంచి ఏఎంసీ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు శ్రీరామ్ రాజగోపాల్, గద్దె రామ్మోహన్, డీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం, నాగుల్ మీరా, కోనేరు శ్రీధర్, బొమ్మసాని సుబ్బారావు, గూడపాటి పద్మశేఖర్, కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నర్రా వాసును బొర్రా రాజేంద్రప్రసాద్, బొర్రా వెంకటేశ్వరరావు (చిన్న), చిట్టినేని వెంకటేశ్వరరావు, శాఖమూరి గోపికృష్ణ, ఆలూరి చిన్న, వీరమాచనేని క్రాంతి కుమార్, పొన్నం శ్రీనివాసరావు (భీముడు), దాసరి హరికృష్ణ, పాటిబండ్ల జగదీష్, చిగురుపాటి నాగరాజు, అజ్జరపు సాయి, నూతలపాటి రఘు, నర్రా వాసు ఫ్రెండ్స్ సర్కిల్ తదితరులు అభినందించారు.



సాయి ఆలయంలో పూజలు

ఇబ్రహీంపట్నం : ఏఎంసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టేందుకు వెళుతున్న నర్రా వాసు సతీసమేతంగా సాయిపురం కాలనీలోని సాయిబాబా మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ కేశినేని శివనాథ్

విద్యాధరపురం : విజయవాడ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన నర్రా వాసుకు, కమిటీ డైరెక్టర్లకు విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) ఆదివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.

మతిస్థిమితం లేని భర్తను కడతేర్చిన భార్య

» నెపం మామ, మరిదిపై నెట్టే ప్రయత్నం



మృతుడు శ్రీనివాసరావు

చల్లపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యం, మతిస్థిమితం సరిగా లేని భర్తను కడతేర్చిన భార్య ఉదంతం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘంటసాల మండలం దేవరకోట గ్రామానికి చెందిన బోలెం శ్రీనివాసరావు(45)కు సుమారు ఇరవైఏళ్ల క్రితం చిట్టూర్పు గ్రామానికి చెందిన మంగమ్మతో వివాహమైంది. వారికి కుమారుడు కార్తీక్ ఉన్నాడు. కొన్నాళ్లకు మంగమ్మ భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయిన సమయంలో భర్తను గోడకేసి కొట్టడంతో అప్పటి నుంచి శ్రీనివాసరావుకు మతిస్థిమితం సరిగాలేక అనారోగ్యానికి గురైనట్టు కుటుంబసభ్యులు చెబుతున్నారు. రొయ్యల కంపెనీలో కూలీపనికి వెళ్లే మంగమ్మ కొన్నేళ్లుగా చల్లపల్లి నారాయణరావునగర్‌లోని గురుకుల పాఠశాల సమీపంలో ఉంటోంది. ఐదునెలల క్రితం పెద్దల సమక్షంలో భర్తతో కలిసి ఉంటానని చెప్పి దేవరకోటలో సుమారు నెల రోజులు ఉండి తర్వాత భర్తను చల్లపల్లి తీసుకువచ్చేసింది. భర్తను తరచుగా కొడుతున్న మంగమ్మ శనివారం భర్తను కర్రతో కొట్టడంతో శ్రీనివాసరావు మృతి చెందాడు. సమాచారం అందుకున్న చల్లపల్లి పోలీసులు విచారణ చేపట్టారు. ఆదివారం మృతదేహాన్ని అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి శవపరీక్షకు తరలించారు. అనంతరం మృతదేహాన్ని తండ్రికి అప్పగించారు. మృతుడి తండ్రి బోలెం గురునాథప్రసాద్ ఫిర్యాదు మేరకు మంగమ్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మామ, మరిదిపై నెపం నెట్టే ప్రయత్నం

భర్తను తరచుగా కొడుతున్నట్టు మంగమ్మపై ఆరోపణలున్నాయి. శనివారం మామ, మరిది చల్లపల్లి వచ్చి తన భర్తను కొట్టివెళ్లారంటూ పోలీసుస్టేషన్‌కు వెళ్లింది. మామ, మరిదిపై నెట్టేందుకు ప్రయత్నించింది. పోలీసులు భార్య, కుమారుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, మంగమ్మ కర్రతో కొట్టడంతో మృతిచెందినట్టు నిర్ధారించుకున్నారు.

చెరువులు కబ్జా!

(5వ పేజీ తరువాయి)

వదిలేయడంతో నీరు కలుషితమవుతోంది.

ఓటు బ్యాంకు రాజకీయాల్లో భాగంగా..

ఆక్రమణలు అడ్డుకుంటే ఓట్లు పోతాయనే భయంతో స్థానిక ప్రజాప్రతినిధులు కొందరు పట్టించుకోకుండా వదిలేశారని విమర్శలు ఉన్నాయి. అదే సమయంలో తామేమి తక్కువ కాదన్నట్టు వీరు పలు చోట్ల కబ్జా చేసిన స్థలాలను అమ్మేసుకుని సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

పూర్తి స్థాయి సర్వే చేస్తేనే..

ముఖ్యంగా బేతవోలు, నాగన్న చెరువు గట్లపై ఆక్రమించుకుని నివాసాన్ని ఏర్పాటు చేసుకున్న వారికి గతంలో ప్రభుత్వం ఇళ్ల స్థలాలను ఇచ్చిందో లేదో పూర్తిస్థాయి సర్వే నిర్వహిస్తే అసలు విషయం బయటపడుతుంది. మున్సిపల్, రెవెన్యూ అధికారుల సమాచారం మేరకు దాదాపుగా 99శాతం మందికి ఇళ్ల లేదా టిడ్కో గృహాలను కేటాయించారు. కానీ అక్కడికి వెళ్లిన దాఖలాలు లేవు.

ఆక్రమణల తొలగింపు సాధ్యమేనా!

ఎన్నో ఏళ్లుగా పాతుకుపోయిన వారిని తొలగించాలంటే పెద్ద సాహసమే చేయాలి. ఇప్పటికే మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఆయా చెరువుల గట్ల ఆక్రమణదారుల వివరాలను సేకరించారు. ఇక్కడి స్థలం వదులుకోకూడదనే ఉద్దేశ్యంతో తమ స్థానంలో కొడుకునో, కుమార్తెనో, దూరపు బంధువులనో తీసుకువచ్చి ఎప్పటి నుండో ఇక్కడే నివాసముంటున్నట్లు చిత్రీకరిస్తూ ప్రభుత్వాన్ని, అధికారులను మోసం చేస్తున్నారు. ముఖ్యంగా రెండు చెరువు గట్లపై దేవాలయాలు, కర్మల భవనం వెలిశాయి. వాటిని తొలగిస్తారా లేదా మినహాయిస్తారా అనే మీమాంస నెలకొంది.

క్లీన్ అండ్ గ్రీన్ గుడివాడ లక్ష్యం



ఎన్నికలకు ముందు, తర్వాత గుడివాడ పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చాలని పదే పదే అనేక సందర్భాల్లో, బహిరంగ సభల్లో చెప్పా. చెరువులను అభివృద్ధి పరచి వినియోగంలోకి తీసుకురావాలని ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. ఆయా చెరువుల గట్లపై నడక దారి ఏర్పాటు, కట్టలు పటిష్టం చేసేందుకు ప్రాధాన్యం ఇస్తాం.

- వెనిగండ్ల రాము, ఎమ్మెల్యే

గలగలా కృష్ణమ్మ

(5వ పేజీ తరువాయి)

ఉపాధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు, కృష్ణా తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, వైస్ ఛైర్మన్ వల్లూరిపల్లి గణేశ్, జలవనరుల శాఖ ఈఎన్‌సీ కె.నరసింహమూర్తి, సీఈ పి.రాంబాబు, ఎస్ఈ ఆర్.మోహనరావు, ఈఈలు రావెళ్ల రవికిరణ్, బి.ఆంజనేయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాడెల్టాపై ప్రత్యేక దృష్టి

-బొండా ఉమామహేశ్వరరావు, సెంట్రల్ ఎమ్మెల్యే

ప్రభుత్వం కృష్ణాడెల్టాపై ప్రత్యేక దృష్టి పెట్టింది. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడల్లా డెల్టాకు సకాలంలో నీటిని విడుదల చేసేది. గడచిన ప్రభుత్వ హయాంలో నీటి విడుదల కోసం రైతులు పోరాటాలు చేయాల్సి వచ్చింది. ఇప్పుడు సాగు ప్రణాళిక విడుదల చేస్తున్నాం. డెల్టాకు నీటి విడుదల వల్ల 7.40 లక్షల ఎకరాల ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించడంతోపాటు ఎరువులు, విత్తనాలు సకాలంలో అందిస్తున్నాం. పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నాం. అన్ని రకాలుగా రైతులను ఆదుకుంటున్నాం. గత ప్రభుత్వంలో ధాన్యం సేకరణ అస్తవ్యస్తంగా ఉండి సకాలంలో రైతులకు డబ్బులు అందక రైతులు ఇబ్బందిపడేవారు. ఇప్పుడు పక్కా ప్రణాళికతో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ధాన్యం సేకరణ జరిపి సకాలంలో రైతు ఖాతాలకు జమ చేస్తున్నాం. భవిష్యత్తులోనూ షెడ్యూల్ ప్రకారం నీటిని విడుదల చేసి కృష్ణాడెల్టా రైతులకు అండగా ఉంటాం.

కాల్వగట్లను పట్టించుకోలేదు

-యార్లగడ్డ వెంకట్రావు, గన్నవరం ఎమ్మెల్యే

వైసీపీ ప్రభుత్వం కాల్వల్లో గుర్రపు డెక్క, తూటుకాడ తొలగించకపోవడంతో గట్లకు గండ్లు పడ్డాయి. దాని ఫలితంగానే బుడమేరుకు వరద వచ్చింది. ఆ ప్రభుత్వంలో ఖరీఫ్, రబీ పంటలకు సకాలంలో సాగునీరు అందించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. పదో తేదీనే కాల్వలకు నీటిని విడుదల చేయాలని నీటి పారుదల సలహా మండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నాం. సాగుకు రైతులు సిద్ధంగా లేకపోవడంతో ఇప్పుడు విడుదల చేస్తున్నాం. రైతులకు సకాలంలో నీరు అందించి వారి సంక్షేమానికి చేస్తున్నాం.

నీటి విడుదలకు పోరాటాలు చేయాల్సి వచ్చేది

-మండలి బుద్ధప్రసాద్, అవనిగడ్డ ఎమ్మెల్యే

వైసీపీ ప్రభుత్వ హయాంలో నీటి విడుదల కోసం పోరాటాలు చేయాల్సి వచ్చేది. అవనిగడ్డ కృష్ణాడెల్టాలో ఆఖరి నియోజకవర్గం. కొద్దిపాటి వర్షానికే పంటలు ముంపులో ఉండేవి. ఆ పరిస్థితి నుంచి ముందుగానే ఖరీఫ్ పంటకు సాగునీరును అందిస్తున్నాం. వైసీపీ హయాంలో జలవనరుల శాఖకు నిధులను విడుదల చేయలేదు. దీనితో కాల్వల్లో తూటుకాడ, గుర్రపు డెక్కతో నిండిపోయాయి. కొద్దిపాటి వర్షానికి పంట పొలాలు మునిగి రైతులు నష్టపోయేవారు. ఇప్పుడు కాల్వలకు మరమ్మతులు చేపట్టి రైతులకు సకాలంలో సాగునీరు అందిస్తున్నాం.

సరిహద్దుల్లో కిక్

(5వ పేజీ తరువాయి)

ఉంటున్నాడు. స్నేహితుడు మనోహర్ ద్వారా ఢిల్లీ నుంచి ఎండీఎంఏ డ్రగ్‌ను హైదరాబాద్‌కు పార్శిల్ సర్వీసు తెప్పించుకుని అక్కడి నుంచి విజయవాడకు తీసుకొచ్చేవాడు. ఇలా కొద్దిరోజుల క్రితం ఎండీఎంఏ తీసుకొస్తుండగా జీవన్‌తోపాటు మరో ఇద్దరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వారిలో బొంతు నితీష్‌కుమార్ అనే యువకుడు విజయవాడ ఫన్‌టైం క్లబ్ వీధికి చెందిన వాడు. మరో నిందితుడు తరుణ్‌ప్రసాద్ యనమలకుదురు గ్రామానికి చెందిన వాడు. కొద్దిరోజుల క్రితం పటమట పోలీసులు నమోదు చేసిన కేసు ఇది. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ సరిహద్దుల్లో మత్తు గ్యాంగ్‌లు పెరుగుతున్నాయి. ముఖ్యంగా తూర్పు భాగంలో ఈ గ్యాంగ్‌ల సంచారం, కొత్త గ్యాంగ్‌ల ఏర్పాటు ఎక్కువగా ఉంది. వాస్తవానికి కమిషనరేట్‌కు పశ్చిమ వైపున తెలంగాణ సరిహద్దుగా ఉంది. ఉత్తరం వైపున గుంటూరు జిల్లా సరిహద్దుగా ఉంది. ఈ రెండింటితో లేని బెంగ ఎక్కువగా తూర్పు వైపు సరిహద్దుతో ఉంటోంది. కమిషనరేట్‌కు పెనమలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో సరిహద్దుగా ఉంది. పటమట పోలీసు స్టేషన్ సరిహద్దులను ఆనుకుని ఈ సరిహద్దులు ఉన్నాయి. ఇది కాకుండా గూడవల్లి వైపున గన్నవరం పోలీసు స్టేషన్ పరిధి సరిహద్దు ప్రాంతంగా ఉంది. ఈ సరిహద్దులు భౌగోళికంగానే కాకుండా శాఖల పరంగా ఉంటున్నాయి. ముఖ్యంగా ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌కు ఈ సరిహద్దు ఒక తలనొప్పిగా మారిపోయింది. గంజాయి కేసుల్లో చిక్కుతున్న నిందితుల్లో ఎక్కువ మంది పెనమలూరు మండలానికి చెందిన వారే ఉంటున్నారు.

కూటమి ప్రభుత్వం రాకతో ప్రత్యేక బృందం ఏర్పాటు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గంజాయి, మాదక ద్రవ్యాలను అరికట్టడానికి పక్కా ప్రణాళికను రూపొందించింది. ఇందు కోసం ఈగల్ పేరుతో ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. పోలీసు కమిషనరేట్ అధికారులు గంజాయితో సంబంధం ఉన్న వారి లెక్కలను పక్కాగా సేకరించారు. స్మోకర్లు చిక్కినప్పుడల్లా ఒక్కో కింగ్ పేరు వెలుగులోకి వస్తోంది. యువతకు గంజాయి ఒడిసా సరిహద్దుల నుంచి వస్తుందని నిర్ధారించారు. అక్కడి నుంచి గంజాయిని తీసుకొస్తున్న గ్యాంగ్‌లు పెనమలూరు మండలంలో తేలుతున్నాయి.

ఏడాదిలో 100 మంది అరెస్టు

ఏడాది కాలంలో గంజాయిలో కేసుల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు సుమారుగా 100 మంది నిందితులను అరెస్టు చేసినట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వారిలో 30 మంది వరకు పెనమలూరు పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన వారే కావడం గమనార్హం. విజయవాడ నగరంలోకి గంజాయి పెనమలూరు పరిధి నుంచే వస్తుందని పోలీసు కమిషనరేట్ అధికారులు ఒక నిర్ధారణకు వచ్చారు. కానూరు, యనమలకుదురు, తాడిగడప, పోరంకి ప్రాంతాల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకుని విజయవాడ పరిధిలో వ్యవహారాలు సాగిస్తున్నారు. ఈ కేసుల్లో పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్టు చేస్తే వారిలో ఇద్దరు, ముగ్గురు ఆ ప్రాంతానికి చెందిన వారే ఉంటున్నారు. దీనిపై పోలీసులు మల్లగుల్లాలు పడుతున్నారు.

సరిహద్దు ప్రాంతాల్లో కొరవడిన నిఘా

పెనమలూరు పోలీస్‌స్టేషన్ ఒకప్పుడు పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉండేది. గత వైసీపీ ప్రభుత్వం కొత్త జిల్లాలను లోక్‌సభ స్థానాల పరిధిని బట్టి ఏర్పాటు చేసింది. దీంతో పెనమలూరు కృష్ణాజిల్లా పరిధిలోకి వెళ్లిపోయింది. ఎన్టీఆర్ జిల్లాకు సరిహద్దులుగా ఉన్న ప్రాంతాలను పెనమలూరు పోలీసులు పెద్దగా పట్టించుకుంటున్న దాఖలాలు లేవన్న విమర్శ ఆ ప్రాంతాల్లో వినిపిస్తోంది. కానూరు, యనమలకుదురు వాస్తవానికి పెనమలూరు మండలంలో ఉన్నప్పటికీ విజయవాడలో భాగంగానే కనిపిస్తాయి. దీనితో గంజాయి మాఫియా రెచ్చిపోతోంది. పైకి రకరకాల వ్యాపారాలు చేస్తున్నట్టు కనిపించి అంతర్గతంగా గంజాయిపై ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు. ఈ గంజాయి సరఫరాకు నగరంలో ఉన్న స్మోకర్లను ఏజెంట్లుగా నియమించుకుంటున్నారు. కిక్కు కేంద్రంగా మారిన ఈ సరిహద్దు ప్రాంతాలపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్న యోచనలో అధికారులు ఉన్నారు.



కొండపల్లి పీఠంపై ఎవరో?

» మున్సిపల్ చైర్మన్ ఉత్కంఠకు నేటితో తెర

» తొలిసారి తమ అభ్యర్థేనని టీడీపీ ఆశాభావం

ఇబ్రహీంపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కొండపల్లి మున్సిపల్ చైర్మన్ ఎవరనేది సోమవారంతో తేలిపోనుంది. సోమవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో హైకోర్టు తీర్పు సీల్డ్ కవర్‌ను అధికారులు కౌన్సిలర్ల సమక్షంలో తెరవనున్నారు. కవర్‌లో విజేత ఎవరనేది తేలనుందా లేక టాస్ వేయాల్సిన అవసరం పడుతుందో తేలిపోనుంది. అప్పటి టీడీపీ ఎంపీ కేశినేని నాని ఎక్స్ అఫిషియో ఓటు చెల్లితే చైర్మన్‌గా టీడీపీకి చెందిన చెన్నుబోయిన చిట్టిబాబును ప్రకటిస్తారు. నాని ఓటు చెల్లుబాటు కాదు అని తీర్పులో తేలితే అటు టీడీపీ, ఇటు వైసీపీకి సమానంగా కౌన్సిలర్లు ఉన్నట్టు.. టాస్ వేసి ఎవరు చైర్మన్ అనేది ప్రకటిస్తారా లేక మరల ఎన్నిక పెడతారా వేచి చూడాలి. అయితే చైర్మన్ పీఠం తమదేనని టీడీపీ ధీమా వ్యక్తం చేస్తున్నది. ఈ పరిణామాన్ని ఎలా ఎదుర్కోవాలో వైసీపీ వ్యూహాత్మకంగా పావులు కదిపే అవకాశం లేకపోలేదు. ఈనెల 9న సీల్డ్ కవర్ ఓపెన్ చేయకుండా అనివార్య కారణాలతో వాయిదా వేస్తే టీడీపీ వాళ్లు పారిపోయారని కొండపల్లి మున్సిపల్ చైర్మన్ వైసీపీదే అని చైర్మన్ గుంజా శ్రీనివాసరావు అని, వైస్ చైర్మన్‌లు కూడా మావారే అని మాజీమంత్రి జోగి రమేశ్ మీడియా సమావేశంలో గొప్పలు చెప్పారు. పటిష్టమైన పోలీస్ బందోబస్తు మధ్య సీల్డ్ కవర్ ఓపెన్ చేయకుంటే ఫలితం వైసీపీకి వ్యతిరేకంగా వస్తే ఖచ్చితంగా వైసీపీ మూకలు అల్లర్లు చేయడం ఖాయమనే వాదన వినిపిస్తున్నది. మొత్తం మీద కొండపల్లి మున్సిపల్ చైర్మన్ ఎవరనేదికి కొన్ని గంటల్లోనే తేలిపోనుంది.



బస్టాండ్ సెంటర్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద జగన్ పత్రిక ప్రతులు దహనం చేస్తున్న తెలుగు మహిళలు

రోత పత్రికను బ్యాన్ చేయాల్సిందే

» తెలుగు మహిళా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత

మచిలీపట్నం టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తూ మహిళలను కించపరిచిన జగన్ రోత పత్రికను బ్యాన్ చేయాలని కృష్ణాజిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత డిమాండ్ చేశారు. ఆదివారం బస్టాండ్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద పత్రిక ప్రతులను తెలుగు మహిళలు దహనం చేశారు. అనంతరం బస్టాండ్ సెంటర్ నుంచి లక్ష్మీటాకీసు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తలశిల స్వర్ణలత మాట్లాడుతూ, జగన్‌రెడ్డికి మహిళలంటే కనీస గౌరవం లేదన్నారు. జగన్ రెడ్డి, భారతిరెడ్డిలు మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలుగు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించండి..

» ప్రభుత్వానికి ఎనర్జీ అసిస్టెంట్ల వినతి

ధర్నాచౌక్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని ఎనర్జీ అసిస్టెంట్స్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గ్రామ, వార్డు సచివాలయాలకు అనుబంధంగా పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్ల (జేఎల్ఎం గ్రేడ్-2) అసోసియేషన్ల జేఏసీ ఆధ్వర్యంలో 'ప్రభుత్వానికి వేడుకోలు' సభను స్థానిక ధర్నాచౌక్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్రనేత పుల్లగుమ్మిరాజు మాట్లాడుతూ, 2019లో సచివాలయ వ్యవస్థలో భాగంగా ఎనర్జీ అసిస్టెంట్లను నియమించడం జరిగిందన్నారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 150 మంది ఎనర్జీ అసిస్టెంట్లు ప్రమాదాలకు గురై మృతి చెందారని, 250 మందికి పైగా వికలాంగులై కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై విద్యుత్‌శాఖ స్పందించలేదని వాపోయారు. ఎనర్జీ అసిస్టెంట్లకు ప్రమోషన్లు కల్పించాలన్నారు. కొత్త సర్వీస్ రెగ్యులేషన్స్ పేరుతో విద్యుత్‌శాఖ యాజమాన్యాలు ఎనర్జీ అసిస్టెంట్ల జీవితాలతో ఆటలాడుతోందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని ఎనర్జీ అసిస్టెంట్లు కోరుతున్నారు. జేఏసీ నేతలు మల్లిఖార్జునరెడ్డి, రాజేష్ వంక, సుధీర్, ఎనర్జీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గన్నవరం విమానాశ్రయంలో

కేంద్రమంత్రికి ఘన స్వాగతం



గన్నవరం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. రాష్ట్రంలో రెండు రోజుల పర్యటనకు విచ్చేసిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్ ఆదివారం విచ్చేసారు. గన్నవరం విమానాశ్రయంలో గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రమణ్యం పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రి, ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశం అయ్యేందుకు బయలుదేరి వెళ్లారు.

పాలడుగు శివకు గద్దర్ అవార్డు



ఉయ్యూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ముదునూరుకు చెందిన పాలడుగు శివ ఉత్తమ కథారచయితగా తెలంగాణ ప్రభుత్వం నుంచి గద్దర్ అవార్డు అందుకున్నారు. 'మ్యూజిక్ షాప్ మూర్తి' సినిమా కథారచయితగా శివకు తొలిచిత్రం కావడం విశేషం. హైదరాబాద్‌లో జరిగిన గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ 2024 ప్రదానోత్సవంలో తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి, దిల్‌రాజు నుంచి శివ అవార్డు అందుకున్నారు. శివకు గ్రామస్థులు అభినందనలు తెలియజేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	108, 116, 127
చికెన్ విత్ స్కిన్	206
చికెన్ స్కిన్‌లెస్	216



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

రేపటి నుంచి టీటీడీ పురాణ ప్రవచనాలు

కంకిపాడు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో చెన్నకేశవస్వామి దేవస్థానంలో ఈనెల 17వ తేదీ నుంచి 26వ తేదీ వరకు హిందూ పరిరక్షణ పురాణ ప్రవచనాలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు అర్చకుడు అగ్నిహోత్రం హరిబాబు తెలిపారు. పురాణ ప్రవచనాల పోస్టర్‌ను ఆదివారం దేవస్థానం ఆవరణలో ఆయన ఆవిష్కరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం పండితుడు కోలా నాగగంగాధరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో శేషుబాబు, బి.భార్గవి, గుండెబోయిన రాము, ఎం.సాయినాగసాయిమల్లేశ్వరి, ఎం. రెడ్డి పాల్గొన్నారు.



నాడు-నేడు పనుల్లో
డొల్లతనం

బాపులపాడు ఎంజీనగర్ ప్రాథమిక పాఠశాలలో పగిలిన ఫ్లోరింగ్ ● మూలనపడ్డ వాటర్ ప్లాంట్



పగిలిపోయిన టైల్స్ ఫ్లోరింగ్

(ఆంధ్రజ్యోతి-హనుమాన్‌జంక్షన్): వైసీపీ ప్రభుత్వ హయాంలో 2020-21లో నాడు-నేడు నిధులతో బాపులపాడు ఎంజీ నగర్ ప్రాథమిక పాఠశాలను రూ.21లక్షలతో మోడల్ పాఠశాలగా అభివృద్ధి చేశారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులను టైల్స్‌తో ఫ్లోరింగ్ చేశారు. మరుగుదొడ్లు అభివృద్ధి చేశారు. కాంపౌండ్ వాల్‌ను రంగులతో తీర్చిదిద్దారు. వాటర్ ప్లాంట్ కూడా ఏర్పాటు చేశారు. అయితే కొద్ది కాలనికే నాడు-నేడు పనుల్లో డొల్లతనం బయటపడింది. అభివృద్ధి చేసిన ఏడాదికే టైల్స్‌తో నిర్మించిన ఫ్లోరింగ్ నెర్రలిచ్చింది. విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించడానికి ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ కూడా గతేడాది మూలనపడింది. నాడు-నేడు పనుల్లో నాణ్యతా లోపాలను ఆనాడే ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. అయినా తూతూ మంత్రంగా పనులు చేశారు. గత వైసీపీ ప్రభుత్వ జీవోనెం 117 ప్రకారం పాఠశాలలోని 3, 4, 5 తరగతులను సమీపంలోని బాపులపాడు హైస్కూల్‌కు మ్యాపింగ్ చేయడంతో 2021-22 నుంచి మోడల్ స్కూల్ 1, 2తరగతులకు పరిమితమైపోయింది. లక్షలాది రూపాయల వ్యయంతో అభివృద్ధి చేసిన మోడల్ స్కూల్ సాధారణ పాఠశాలగా కేవలం 30 మంది విద్యార్థులతో గత మూడేళ్లు నడపాల్సి వచ్చింది. పాఠశాలలో సమస్యలను పట్టించుకోలేదు. వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులైనా చేయలేదు. విద్యార్థులు ఎవరికి వారు సీసాల్లో తాగునీరు తెచ్చుకుంటున్నారు. పగిలిపోయి అధ్వానంగా ఉన్నా ఫ్లోరింగ్‌ను కూడా మరమ్మతు చేయలేదు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఈ ఏడాది కూటమి ప్రభుత్వం పాఠశాలలను పునర్విభజన చేసింది. బాపులపాడు మండలంలో 11 ప్రాథమిక పాఠశాలలను మోడల్ స్కూళ్లుగా ఎంపిక చేసింది. అందులో ఈ పాఠశాల కూడా ఉంది. హైస్కూల్‌లో కలిపిన 3, 4, 5 తరగతులను తిరిగి వెనక్కి పంపారు. దీంతో విద్యార్థుల సంఖ్య పెరగనుంది. పెరగనున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను పెంచి, పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. మండల పరిషత్, ఎంఈవో, తహసీల్దార్ కార్యాలయాలు పక్కనే ఉన్న ఈ పాఠశాల నిర్వహణపై అధికారులు చూపిస్తున్న తీరు పట్ల వారు పెదవి విరుస్తున్నారు. మోడల్ స్కూల్‌గా ఎంపిక చేసిన ఈ పాఠశాలలో మౌలికసదుపాయాలు మెరుగుపర్చాలని కోరుతున్నారు.



మరమ్మతులు చేయించకపోవడంతో మూలనపడ్డ ఆర్వో వాటర్ ప్లాంట్



సూపర్‌విజ్ రోడ్డులో మూడురోజులుగా పేరుకుపోయిన చెత్త

అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ

- తాడిగడప మునిసిపాలిటీలో ఎక్కడికక్కడే పేరుకుపోతున్న చెత్త
- సేకరణలో సిబ్బంది అలసత్వం ● వెదజల్లుతున్న దుర్గంధం
- దోమల విజృంభణ, పందుల స్వైరవిహారం

(ఆంధ్రజ్యోతి-పెనమలూరు): తాడిగడప మునిసిపాలిటీలో చెత్తకుప్పలు రోజుల తరబడి పేరుకుపోతున్నాయి. తాడిగడప, కానూరు ప్రధాన రోడ్డు, వృద్ధాశ్రమం రోడ్డు, సనత్‌నగర్, సూపర్‌విజ్‌రోడ్డు, పోరంకి నిడమానూరు రోడ్డు, టీడీపీ కార్యాలయం రోడ్డుల్లో రోజూ చెత్త ఉంటోంది. సూపర్‌విజ్ రోడ్డు, కానూరు మహదేవపురం కాలనీ సెంటరు వద్ద, కానూరు చిన్న చెరువు, వినాయకనగర్ కాలనీల పరిసరాలు, నవతా రోడ్డు వెంట రోజుల తరబడి చెత్త సేకరణ జరగడంలేదు. దీంతో దుర్గంధం వెదజల్లి..చుట్టుపక్కల వారు, వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. చెత్తకుప్పల వద్ద దోమలు విజృంభిస్తున్నాయి. పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. చెత్త సేకరణలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు అంటున్నారు. మునిసిపాలిటీలో చెత్త సేకరణ, శానిటేషన్ పనులను క్రమం తప్పకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలు ఇబ్బంది పడుతున్నారు

చెత్త సేకరణ, డ్రెయిన్ల నిర్వహణ సరిగా లేకపోవడతో కానూరులో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. డ్రెయిన్లలో మురుగు పారుదల సరిగ్గా ఉండడం లేదు. దోమలు వృద్ధి చెందుతున్నాయి. సమస్యలను అధికారులు పరిష్కరించాలి.

-అంగిరేకుల మురళి, టీడీపీ నాయకుడు, కానూరు



బాపులపాడు మండల వ్యవసాయ కార్యాలయంలో రైతుల వేలిముద్రలు తీసుకుంటున్న సిబ్బంది

వేగంగా అన్నదాత సుఖీభవ కేవైసీ

హనుమాన్‌జంక్షన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కొద్దిరోజుల్లో అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం సంసిద్ధమవడంతో అర్హులైన రైతుల బ్యాంకు ఖాతా, ఆధార్ అనుసంధానంతో కూడిన కేవైసీ కార్యక్రమాన్ని గ్రామాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది చేపట్టారు. బాపులపాడు మండలంలో 21,180 మంది రైతులు ఉండగా అందులో 9,048 మందిని అర్హులుగా గుర్తించారు. వారి కేవైసీని రెండు రోజులుగా నమోదు చేస్తున్నారు. ఆదివారం గ్రామ సచివాలయాల్లో వ్యవసాయ సహాయకులు కేవైసీ నమోదు చేశారు. మండలంలో ఇప్పటి వరకు 2,700 మంది రైతుల ఆధార్‌లను అనుసంధానించినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. రైతులకు తమ భూములు ఏ ప్రాంతంలో ఉన్నా నివశించే గ్రామ సచివాలయంలో కేవైసీ చేయించుకుని, అప్‌డేట్ చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. దీంతో రైతులకు పెద్ద ప్రయాస తప్పినట్టయింది.

గోవింద నామావళి పుస్తకాల అందజేత

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ప్రజల్లో భక్తి విశ్వాసాలను పెంపొందించి, అయోధ్యలో నిర్మించే సహస్ర కోటి గోవింద నామ స్థూప నిర్మాణంలో భాగస్వాములను చేసేందుకు గోవింద నామావళి పుస్తకాలను అందజేస్తున్నామని గన్నవరం డివిజన్ ధర్మప్రచారక్ యడవల్లి పాండు రంగారావు తెలిపారు. రేమల్లెలోని శ్రీకోదండ రామాలయంలో గోవింద నామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు గోవింద నామావళి పుస్తకాలను అందజేశారు. ప్రజలకు సనాతన ధర్మ వైశిష్ట్యాన్ని తెలియజేసేలా వేంకటేశ్వరస్వామి 108 నామావళిని పలుకుతూ పుస్తకాన్ని పూర్తిచేయాలని భక్తులకు సూచించారు. గ్రామ భక్తబృంద సభ్యులు పాల్గొన్నారు.

పెయింటర్ ఆత్మహత్య

కంకిపాడు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని పెయింటర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన పునాదిపాడులో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పునాదిపాడుకు చెందిన ముత్తయ్య(45) పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. పదేళ్ల క్రితం భార్య మృతి చెందింది. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఆదివారం ఇంట్లో పైకప్పు ఇనుప రాడ్డుకు చీరతో ఉరేసుకున్నాడు. ముత్తయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సోలార్ ప్లాంట్‌లో మరింత విద్యుదుత్పత్తి చేయండి

- సిబ్బందికి దుర్గగుడి ఈవో శీనానాయక్ ఆదేశం



పాతపాడులో దుర్గగుడికి చెందిన సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన భూముల్లో ఆలయ అవసరాలకు ఉపయోగపడుతుందని 2016-18లో పనులు ప్రారంభించిన సోలార్ ప్లాంట్ పనితీరు సరిగ్గా లేదని, మెరుగుపరిచి విద్యుదుత్పత్తి మరింత పెంచాలని సిబ్బందిని దేవస్థానం ఈవో వీకే శీనానాయక్ ఆదేశించారు. విజయవాడ రూరల్ మండలం పాతపాడు పంచాయతీ పరిధిలోని దేవస్థానం సోలార్ ప్లాంట్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. 5 ఎకరాల 85 సెంట్లు ఉన్న దుర్గమ్మ స్థలంలో 1 మెగా వాట్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ప్లాంట్ పనులు 2022కి పూర్తయ్యి ఉత్పత్తి మొదలైందని సిబ్బంది ఈవోకు వివరించారు. ప్రస్తుతం ఈ ప్లాంట్ ద్వారా నెలకు 1.20 వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుండగా, ఇంద్రకీలాద్రిపై నెలకు లక్ష యూనిట్ల వినియోగం జరుగుతుందని సిబ్బంది వివరించారు. 20వేల యూనిట్లకు నెట్ మీటరింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని శీనానాయక్ ఆదేశించారు. సోలార్ ప్లాంట్‌ను ఇంకా మెరుగ్గా నిర్వహిస్తే విద్యుదుత్పత్తి పెరుగుతుందని, నోడల్ ఏజెన్సీ ద్వారా లేఖ రాయాలని, వారం రోజుల్లో పరిస్థితిలో మార్పు వచ్చేలా కార్యాచరణ చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోటేశ్వరరావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సునీల్ పాల్గొన్నారు.

చివరి భూములకూ సాగునీరందిస్తాం

- కాలువల అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన చేస్తున్నాం: డీఈ కె.బాబు



తిప్పనగుంట చానల్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డీఈ బాబు, ఏఈ తనూజ, డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఏలూరు కాలువ పరిధిలోని ఆయకట్టులో చివరిభూములకూ సకాలంలో సాగునీరందించేలా యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నట్టు జలవనరులశాఖ డీఈ కె.బాబు తెలిపారు. తిప్పనగుంట చానల్ వద్ద జరుగుతున్న నూతన తూము నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఏలూరు కాలువకు అనుసంధానంగా ఉన్న సాగునీటి చానళ్లు, డ్రెయిన్ల అభివృద్ధి పనులతో పాటు ప్రధాన కాలువలోని గుర్రపుడెక్కను, డ్రెయిన్లలో తూడును తొలగించి రైతులకు సకాలంలో సాగునీరందించేలా కార్యాచరణ మొదలు పెట్టినట్లు ఆయన వివరించారు. ప్రధాన కాలువకు నీరు వదిలే సమయానికి పనులు పూర్తి చేసి చివరిభూములకు కూడా సకాలంలో నీరందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు ప్రధాన కాలువ(ఏలూరు కాలువ)కు అనుసంధానంగా ఉన్న 5 స్లూయిజ్, డ్రాపులకు తూముల ఏర్పాటు, షట్టర్ల బిగింపు పనులు ముమ్మరంగా సాగుతున్నాయని త్వరితగతిన పూర్తి చేసి సాగునీరందిస్తామని డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ తెలిపారు. ఈఈ తనూజ, వైస్ చైర్మన్ నల్లిబోయిన గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

పెనమలూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఘంటసాలకు చెందిన పర్ణశాల ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో తాడిగడప కర్మెల్ ప్రార్థనా మందిరం ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 120 మందికి మచిలీపట్నానికి చెందిన వైద్యుడు శశాంక్ రక్తపోటు, మధుమేహం, ఆస్తమా, మోకాళ్ల నొప్పులు తదితర దీర్ఘకాలిక వ్యాధులకు పరీక్షలు జరిపి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పాస్టర్లు పీఎస్ రాజు, వెంకటరత్నం, సుకన్య, బిందు, నిఖిల్ సతీష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

తల్లికి వందనం అమలుతో వైసీపీలో గుబులు

- సీహెచ్‌సీ చైర్‌పర్సన్ బోయిన రోహిణీకుమారి



ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న సీహెచ్‌సీ చైర్‌పర్సన్ బోయిన రోహిణీకుమారి, మేదండ్రావు అనురాధ తదితరులు

కంకిపాడు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): 'తల్లికి వందనం పథకం 67 లక్షల మంది పిల్లల తల్లుల కళ్లలో ఆనందాన్ని నింపింది. పథకాన్ని విజయవంతంగా అమలు చేయడంతో వైసీపీలో గుబులు మొదలైంది. అందుకే పథకం అమలుపై ఇష్టానుసారం మాట్లాడుతున్నారు.' అని సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ బోయిన రోహిణీకుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లికి వందనం పథకాన్ని అమలు చేసి, తల్లుల ఖాతాల్లో నగదు జమ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు అథారిటీ సభ్యుడు ముప్పా రాజా, ఏఎంసీ డైరెక్టర్ గుడివాడ సామ్రాజ్యం, జనసేన నాయకులు మేదండ్రావు అనురాధ, ముప్పా నందిని, జక్కా భవాని, సుంకర సురేష్, శ్రీను, పున్నానా కిషోర్, పిచుక క్రాంతి, రవి, యలిశెట్టి జ్యోత్స్న పాల్గొన్నారు



ఐఐటీలో సీటు సాధించిన తుమ్మలచర్ల హారిక తండ్రి శ్రీధర్‌కు రూ.25 వేలు అందిస్తున్న ఏజీ అండ్ ఎస్జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం

ఉయ్యూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్ 2025లో మంచి ర్యాంకు సాధించి, చెన్నై ఐఐటీలో సీటు సాధించిన ఉయ్యూరుకు చెందిన తుమ్మలచర్ల హారికకు ఏజీ అండ్ ఎస్జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.25 వేల ప్రోత్సాహక బహుమతిని ప్రకటించారు. కళాశాల మైదానంలో ఆదివారం అసోసియేషన్ అధ్యక్షుడు సత్తార్, గౌరవ అధ్యక్షుడు నూకల సాంబశివరావు, హిమకరబాబు, బాపిరాజు, వూర కిషోర్ తదితరులు హారిక తండ్రి శ్రీధర్‌కు నగదు అందజేశారు.

సర్వీసు రోడ్డులో చెత్త తొలగింపు



చెత్తకుప్పలు తొలగించాక..

ఉయ్యూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): విజయవాడ- మచిలీపట్నం జాతీయరహదారి పక్కన కాటూరు రోడ్డు అండర్ పాస్ సమీపాన సర్వీసురోడ్డులో పేరుకుపోయిన చెత్తకుప్పలను గండిగుంట పంచాయతీ పారిశుధ్య సిబ్బంది ఆదివారం తొలగించారు. సర్వీసురోడ్డు పక్కన గుట్టల్లా పేరుకుపోయిన చెత్తకుప్పలు కుళ్లి దుర్గం ధం వెదజల్లుతుండడంతో 'చెత్తశుద్ధి ఏది' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఇటీవల కథనం ప్రచురితమైంది. పంచాయతీ కార్యదర్శి కుమార్ స్పందించి, సిబ్బందితో కుప్పలు తొలగింపజేశారు.



డ్రెయినేజీల్లో పూడిక తీశారు.. తరలించడం మరిచారు!



కానూరు డ్రెయినేజీల్లో పూడికతీసి తరలించకుండా వదిలేసిన చెత్తా చెదారం, మట్టి

- మట్టి, చెత్తాచెదారం వల్ల దుర్గంధభరితంగా పరిసరాలు
- ఈగలు, దోమల వృద్ధి..పట్టించుకోని అధికారులు
- ఇబ్బందిపడుతున్న స్థానికులు..

(ఆంధ్రజ్యోతి-కానూరు): తాడిగడప మున్సిపాలిటీ పరిధి కానూరు గ్రామంలోని పలు ఓపెన్ డ్రెయినేజీల్లో పూడికతీసి వాటిలో వచ్చిన మట్టి, చెత్తాచెదారం, వ్యర్థాలను తరలించకుండా అక్కడే వదిలేశారు. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. 20 రోజుల క్రితం డ్రెయినేజీల్లో పూడిక తొలగించారు. పూడిక తీశాక మట్టిని అక్కడే వదిలేశారు. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. గాలికి పూడిక మట్టి నుంచి వచ్చిన చెత్తాచెదారం ఇళ్లల్లోకి వచ్చి ఇబ్బందిపడుతున్నామని స్థానికులు అంటున్నారు. ఈగలు, దోమలు వృద్ధిచెంది అనారోగ్యం బారిన పడుతున్నామని అంటున్నారు. అధికారులు పూడిక మట్టిని వెంటనే తొలగించాలని కోరుతున్నారు.

కొండాలమ్మకు ప్రత్యేక పూజలు

గుడ్లవల్లేరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దాదాపు 25000 మంది అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. భక్తులు పాలపొంగళ్లు వండి అమ్మవారికి సమర్పించి దర్శించుకున్నారు. క్యూలైన్లలోని భక్తులకు తాగునీరు, మజ్జిగ పంపిణీ దేవస్థానం వారిచే ఏర్పాటు చేశారు.


క్యూలో వేచిఉన్న భక్తులు

నేటి నుంచి మోటూరు రైల్వేగేటు మూసివేత

గుడివాడ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మోటూరు రైల్వే గేటును ఈ నెల 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మూసివేస్తున్నట్టు రైల్వే పి.డబ్ల్యూయూ రెహ్మాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15రోజుల పాటు రైల్వే గేటు, ఇతర మరమ్మతుల నిమిత్తం మూసివేస్తున్నామన్నారు. ప్రయాణీకులు, ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.


మొవ్వలో అంకమ్మతల్లి ఊరేగింపు

ఘనంగా అంకమ్మతల్లి నెల సంబరం

కూచిపూడి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మొవ్వలోని తాతినేనివారి ఇలవేల్పు అంకమ్మ తల్లి నెల సంబరం ఆదివారం మేళతాళాలు, డప్పు విన్యాసాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పోతురాజు గడ, అమ్మవారి ఘటంతో ఊరేగింపు జరిగింది. అనంతరం మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.


ఆర్అండ్‌బీ రోడ్డుపై చేపల చెరువు నీళ్లు

ఇలాగైతే .. ప్రయాణం ఎలా..!

నందివాడ : చేపల చెరువుల యజమానులు తమ చేపల చెరువులలోని నీళ్లు మోటార్లతో తోడి రోడ్లపైకి వదులుతున్నారు. దీంతో ఆర్అండ్‌బీ రోడ్డు గోతులమయంగా మారిపోతున్నాయి. దీంతో వాహనదారులు రాకపోకల సమయాల్లో పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. ఇదే సందర్భంగా పొలుకొండ నుంచి రుద్రపాక వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుపై చేపల చెరువు యజమాని మోటార్లతో నీళ్లు తోడి రోడ్డు మీదకు వదిలివేస్తున్నారు. దీంతో నీళ్లన్ని రోడ్డు మీద మోకాలు లోతు నీళ్లు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతా జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎవరూ ఈ నీళ్లు తోడే మోటార్లను ఆపకపోవటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ చేపల చెరువుల నీళ్లు రోడ్డు మీదకు రాకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దట్టంగా తూడు .. పట్టదా రైతు గోడు

● డ్రెయిన్‌లో దట్టంగా పెరిగిన గుర్రపు డెక్క
● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - గుడ్లవల్లేరు) : గుడ్లవల్లేరు ఎఫిడియంట్ డ్రెయిన్‌లో దట్టంగా గుర్రపు డెక్క, జమ్మి మేట వేసి ఉన్నాయి. వర్షాలు మొదలైన నేపథ్యంలో ఈ డ్రెయిన్ పూడిక తీయకపోతే రాబోయే రోజుల్లో 200 ఎకరాల వరి చేలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. దీంతోపాటుగా చంద్రన్న కాలనీ, కొత్త కాలనీలు పూర్తిగా జలమయం అయ్యే ప్రమాదం పొంచి ఉంది. దాదాపు 1.5 కిలోమీటర్లు ఉండే ఈకాల్వలోని మురుగు పోలాజ్ డ్రెయిన్‌లో కలుస్తుంది. ప్రస్తుతం పోలాజ్ డ్రెయిన్ పూడిక తీత పనులు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ఈ డ్రెయిన్ పూడిక తీతలు చేయించాలని ఆప్రాంత రైతులు, కాలనీల వాసులు కోరుతున్నారు. 2023లో కురిసిన వర్షాలకు వరిచేలు ముంపుబారిన పడి పంట నష్టం ఏర్పడిన సమయంలో అప్పట్లో వెనిగండ్ల రాము ప్రొక్లైన్ ఏర్పాటు చేయగా రైతులు ఈ డ్రెయిన్‌ను బాగు చేయించారు. తరువాత ఈ డ్రెయిన్ పూడిక తీయించలేదు. ఇప్పటికైనా సదరు అధికారులు దృష్టి సారించి పూడిక తీయించి కాలనీలను ముంపుబారిన పడకుండా కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చర్యలు చేపడతాం
గుర్రపడెక్క తొలగింపునకు మందు పిచికారీకి నిధులు మంజూరయ్యాయి. అయితే ఇప్పుడు డ్రెయిన్ ఉన్న పరిస్థితికి పిచికారీతో సమస్య తీరదు. ప్రొక్లైన్‌తో పని చేస్తే నేకానీ ఈ సమస్య తీరే పరిస్థితి లేదు.
రాజ్‌కుమార్ ,డ్రెయినేజీ జేఈ


డ్రెయిన్‌లో దట్టంగా పెరిగిన గుర్రపుడెక్క, జమ్మి


యండూరి పిచ్చేశ్వరరావును సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నేతలు

యండూరికి సత్కారం

పమిడిముక్కల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మొవ్వ మార్కెట్ కమిటీ పాలవర్గ సభ్యునిగా బాధ్యతలు చేపట్టిన యండూరి పిచ్చేశ్వరరావును ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. మేడూరులో కోదండరామస్వామి ఆలయ ఏడో వార్షికోత్సవ వేడుక వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గడ్డిపాడుకు చెందిన పిచ్చేశ్వరరావును ఆర్యవైశ్య సఘం ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్యవైశ్యసంఘ నాయకులు, పాల్గొని అభినందనలు తెలిపారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

గుడివాడ రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌ను కలిగి ఉండాలని, వాహనానికి సంబంధించిన కాగితాలను అందుబాటులో పెట్టుకోవాలని ఎస్సై చంటిబాబు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక దొండపాడు రోడ్డులో వాహనాలు నడిపే డ్రైవర్లకు ఆర్‌సీ, ఇతర పత్రాలు ఉన్నవి లేనివి పరిశీలించారు. ఎప్పటికప్పుడు వాహనాలకు చలానాలు కట్టుకోవాలని, డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ చేయించుకోవాలన్నారు. పెండింగ్‌లో బకాయిలు ఉంచకుండా ఎప్పటికప్పుడు రెన్యువల్ చేయించుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. వాహనదారులు డ్రైవింగ్ చేసేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అతివేగంగా వాహనాలు నడపటం వల్ల గుడివాడ చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రమాదాలు సంభవిస్తున్నామని తెలిపారు. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలు చూస్తూ నెమ్మదిగా వాహనాలు నడుపుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉండే వాహనాలను సీజ్ చేసి కోర్టుకు అప్పగించనున్నామని హెచ్చరించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని తెలిపారు. ఈ తనిఖీల్లో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


వాహనాల రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్సై చంటిబాబు

సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

గుడివాడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : సూపర్‌సిక్స్ హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం నత్తనడకగా వ్యవహరిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు ఆరోపించారు. ఆదివారం స్థానిక సుందరయ్యభవన్‌లో టీడీపీ ఏడాది పాలనపై సీపీఎం ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తైనప్పటికీ గత వైసీపీ ప్రభుత్వ విధానాలనే కొనసాగిస్తూ ప్రజలపై భారాలు మోపడానికి మాత్రం కొత్తదారులు వెతుకుతున్నారని విమర్శించారు. గత 15 సంవత్సరాలుగా కార్మికుల కనీస వేతనాల పెంపుపై దృష్టిసారించని ప్ర భుత్వం, వారి పనిగంటలను 8 నుంచి 10 గంటలకు పెం చుతూ కార్పొరేట్ కంపెనీలకు హక్కులు కల్పిస్తూ చట్టాలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. కృష్ణా డెల్టాకు సంబంధించి పంట కాలువలు, మేజర్ డ్రెయిన్ల అభివృద్ధికి గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. కూటమి ప్రభుత్వం వేసవిలోనే ఆయా పనులను ప్రారంభిస్తూ ఆర్భాటం చేశారని, చివరకు వర్షాలు ప్రారంభమయ్యాక పనులను ప్రారంభించి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నారాయణరావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్‌లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

టిడ్కో లబ్ధిదారుల మార్టిగేజ్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి : కమిషనర్

గుడివాడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకు రుణాలు మంజూరైన టిడ్కో లబ్ధిదారులు వెంటనే మార్టిగేజ్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ ఆదేశించారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్లాయిపాలెం గ్రామశివారులో నిర్మించిన టిడ్కో కాలనీలో 2792 మంది లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించామన్నారు. వారిలో బ్యాంకు రుణం మంజూరైన 2300మంది లబ్ధిదారులు మార్టిగేజ్ రిజిస్ట్రేషన్ చేయకుండా తాత్సర్యం చేస్తున్నారన్నారు. వెంటనే మార్టిగేజ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక కైకాల కళామందిరంలో మార్టిగేజ్ రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామని, జూన్ నెలాఖరు లోపు పెండింగ్‌లో ఉన్న మార్టిగేజ్ రిజిస్ట్రేషన్‌లను పూర్తి చేసుకోవాలన్నారు. లబ్ధిదారులుగా ఎంపికై రిజిస్ట్రేషన్ కానీ వారు కట్టవలసిన నగదును చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. ఎటువంటి సందేహాలున్న టౌన్ ప్లానింగ్ సెక్షన్ సెల్ : 77021 54111, మెప్మా సి.ఎం.ఎం బసవేశ్వరరావు సెల్ : 79016 101855కు సంప్రదించాలని కమిషనర్ కోరారు.

ఇళ్లకు విద్యుత్ స్మార్ట్‌మీటర్లు బిగించొద్దు

● సీపీఎం మండల కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

గుడివాడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఇళ్లకు విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును పూర్తిస్థాయిలో ప్రజలు వ్యతిరేకిస్తున్నా ఎందుకు ఏర్పాటుచేస్తున్నారో తెలపాలని సీపీఎం మండల కార్యదర్శి ఆర్‌సీపీరెడ్డి ప్రశ్నించారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ నైజాంపేటలో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం కరపత్రాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లలో ఎవరు లేని సమయంలో విద్యుత్ స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలను చైతన్యపరిచేందుకు ఇంటింటికి కరపత్రాల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. బలవంతంగా స్మార్ట్‌మీటర్ల బిగింపును నిలుపుదల చేయకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పి.రజిని, రేపాని కొండ, చల్లా ప్రసాద్, బొంతు వెంకటేశ్వరరావు స్థానిక నేతలు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు అవగాహన సదస్సు నేడు

నందివాడ : చేపల, రొయ్యల చెరువుల రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలపై గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ మండల కేంద్రమైన నందివాడలోని కొండపల్లి కన్వెన్షన్‌లో ఆక్వా రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు ఎస్సై కె.శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా చెరువుపై విద్యుత్ ప్రమాదాల నివారణ చర్యలు, అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోకుండా తీసుకోవలసి చర్యలపై ఆక్వా రైతులకు తగు సూచనలు ఇవ్వనున్నామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ధీరజ్ వినీల్, తాలుకా సీఐ ఎస్.ఎల్.ఆర్ సోమేశ్వరరావులు పాల్గొంటారని, ఆక్వా రైతులు హాజరు కావాలని ఎస్సై శ్రీనివాస్ కోరారు.

కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

● జిల్లా సీఐటీయూ కార్యదర్శి వెంకటేశ్వరరావు

గుడివాడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేసి, కార్మికులకు కనీస వేతనాలు అమల్జేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్యభవన్‌లో సీఐటీయూ పట్టణ అధ్యక్షురాలు డి.ఆదిలక్ష్మీ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కీం వర్కర్‌లకు సంక్షేమ పథకాలను అమల్జేయాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. జూలై 8వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, కర్షకులు, బిల్డింగ్ వర్కర్లు, అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పట్టణ సీఐటీయూ కార్యదర్శి సి.హెచ్ శివ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రేపాని కొండ, ఆర్పీల యూనియన్ నాయకురాలు దీవెన, శైలజ, నిర్మల, అంగన్వాడీ వర్కర్లు ఆదిలక్ష్మీ, ఆటోనగర్ యూనియన్ నాయకులు బొంతు వెంకటేశ్వర్లు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకుడు శ్రీనివాసరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ధనాల సత్యనారాయణ, సుధాకర్, రెహమాన్, లక్ష్మణ్, ఓ.గంగాధర్, జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఆర్‌సిపి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

నగదు జమ కానివారు ఆందోళన చెందొద్దు

గుడివాడ రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం నగదు అకౌంట్లలో పడని తల్లులు ఆందోళన చెందవద్దని ఎంపీడీవో బి.వై.విష్ణుప్రసాద్ ఆదివారం తెలిపారు. నగదు ఎందుకు జమ కాలేదో సచివాలయాల్లో వెరిఫై చేస్తామని, నగదు పడేలా సచివాలయ ఉద్యోగులు చర్యలు తీసుకుంటారన్నారు. సచివాలయంలో తల్లికి వందనం మంజూరైన లిస్టులు ఉన్నాయని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి తల్లి ఖాతాల్లో తల్లికి వందనం నగదు జమ అవుతుందని ఆయన తెలిపారు.

ట్రై సైకిల్ వితరణ

గుడివాడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో క్లబ్ లైఫ్ పేట్రన్ సభ్యులు ఆర్నేపల్లి పాండు జన్మదినం సందర్భంగా ఆయన వితరణతో ఆదివారం స్థానిక 8వ వార్డుకు చెందిన దివ్యాంగుడు వెంకట్రావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు, కార్యదర్శి దిమ్మిటి శ్రీనివాసరావు, సభ్యులు మున్నలూరి రామకృష్ణ, లింగం చిట్టిబాబు, బొప్పన కుటుంబరావు, కురాకుల శ్రీవిష్ణు, అర్జా ప్రసాద్, సత్యనారాయణ, రామకృష్ణ, సూరి తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం అమలుపై హర్షం


జనసేన కార్యాలయం వద్ద..

గుడివాడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సూపర్‌సిక్స్ కార్యక్రమంలో భాగంగా ఎంత మంది ఉంటే అంతమందికి తల్లికి వందనం నగదును అందజేసిన కూటమి ప్రభుత్వానికి టీడీపీ, జనసేన నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

స్థానిక బొగ్గుబజారులోని జనసేన కార్యాలయంలో నాయకులు సందు పవన్ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే వెనిగండ్ల రాముల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ గుళ్లపల్లి రమాదేవి, వెణుతురుమిల్లి సర్పంచ్ కొప్పినేని శేషవాణి, స్థానిక నాయకులు సీతాల సుభాషిణి, వంగలపూడి రాము, మొగసాల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక 16వ వార్డులో తల్లికి వందనం నగదును జమ చేసిన సందర్భంగా తెలుగు మహిళ పట్టణ అధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి ఆధ్వర్యంలో ఆదివారం చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బూసి విజయభాస్కర్, గుండు వెంకట్రావు, చల్లా బాలాజీ, తమ్మిశెట్టి గోపి, చల్లా వెంకటేశ్వరమ్మ, కొనకళ్ల అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ : కూటమి ప్రభుత్వం యిచ్చిన మాట ప్రకారం ఎంత మంది ఉంటే అంతమందికి తల్లికి వందనం నగదును అందజేసిందని 32వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ చందు శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి స్థానిక 32వ వార్డులో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరీఎమ్మెల్యే వెనిగండ్ల రాముల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గొర్రెల నరేంద్రకుమార్, గొర్రెల పాండురంగారావు, బొడ్డు నాగ వెంకటకిషోర్, కొడిగ కోటేశ్వరరావు, కొడిగ ఆదినారాయణ, ముత్తె వెంకటేశ్వరరావు, బొడ్డు లక్ష్మీ, వెలిచర్ల సుగుణ, చందు కుమారస్వామి పాల్గొన్నారు.


16వ వార్డులో ..


32వ వార్డులో ..

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	108, 116, 127
చికెన్ విత్ స్కిన్	206
చికెన్ స్కిన్‌లెస్	216



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 515



మోపిదేవి ఆలయంలో భక్తుల రద్దీ

మోపిదేవి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో భక్తులు నాగపుట్టలో పాలుపోసి స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆదివారం ప్రత్యేకత కావటంతో ఆదివారం ఒక్కరోజే వివిధ సేవా రుసుముల ద్వారా రూ.10,64,518 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు.



హసీంబేగ్ ఆధ్వర్యంలో ప్ల కార్డులతో నిరసన తెలుపుతున్న 15వ డివిజన్ మహిళలు

రాజధాని మహిళలకు జగన్ క్షమాపణ చెప్పాలి

మచిలీపట్నం టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : రాజధాని మహిళలకు జగన్ తక్షణం క్షమాపణ చెప్పాలని రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు హసీంబేగ్ డిమాండ్ చేశారు. జగన్ మీడియాలో రాజధాని మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం 15వ డివిజన్‌లో మహిళలు ప్ల కార్డులతో ర్యాలీ నిర్వహించారు. హసీంబేగ్ మాట్లాడుతూ, జగన్‌రెడ్డి తన తల్లి, చెల్లిని అవమానపరిచారని, అదే రీతిలో అమరావతిలోని మహిళలపై అసభ్యకరంగా మాట్లాడారన్నారు. మహిళలను కించపరిచే విధంగా మాట్లాడితే జాతి క్షమించదని హెచ్చరించారు.

3500 రోజుకు స్వచ్ఛ చల్లపల్లి

• హైదరాబాద్‌లోనూ డాక్టర్ పద్మావతి స్వచ్ఛ సేవలు



హైదరాబాద్ నగరంలో రోడ్లు ఊడుస్తున్న డాక్టర్ పద్మావతి

చల్లపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ చల్లపల్లి ఉద్యమం ఆదివారం 3500వ రోజుకు చేరింది. స్వచ్ఛ చల్లపల్లి సారధులు డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి దంపతుల నేతృత్వంలో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో కొనసాగుతున్న ఉద్యమంలో భాగంగా ఆదివారం స్వచ్ఛ సేవకులు జాతీయ రహదారిని శుభ్రం చేశారు. మొక్కలు నాటారు. వ్యక్తిగత పనులపై హైదరాబాద్ వెళ్లిన డీఆర్కే దంపతులు ఆదివారం చల్లపల్లిలో 3500 రోజు స్వచ్ఛసేవలో పాల్గొనలేక పోయినప్పటికీ ఆదివారం ఉదయాన్నే హైదరాబాద్ నగరంలో రహదారులను పరిశుభ్రం చేశారు. కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులు విధుల్లో ఉండగా, డాక్టర్ పద్మావతి చీపురు చేతబట్టి ఫుట్‌పాత్‌లను, రహదారులనూ శుభ్రం చేశారు. ప్రతి నిత్యం చల్లపల్లిలో స్వచ్ఛ కార్యకర్తలతో కలిసి ఎంతో శ్రమించే డాక్టర్ పద్మావతి ఒక్కరోజు స్వచ్ఛసేవను సైతం వదలకుండా తెలంగాణా రాజధానిలోనూ సేవలందించటం పట్ల చల్లపల్లి ప్రజలు, స్వచ్ఛ కార్యకర్తలు అభినందనలు తెలిపారు.



స్నానఘట్ల వద్ద మైక్ సిస్టమ్ ప్రారంభించి మాట్లాడుతున్న ఎస్సై వై.వి.సత్యనారాయణ

పెదకళ్లేపల్లి స్నానఘట్ల వద్ద రక్షణ చర్యలు

మోపిదేవి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన పెదకళ్లేపల్లి కృష్ణానది ఘట్ల వద్ద స్నానాలు ఆచరించే భక్తుల సంక్షేమం, రక్షణకు బందోబస్తు చర్యలు చేపట్టినట్లు ఎస్సై వై.వి.సత్యనారాయణ తెలిపారు. సమాచార కేంద్రం ఏర్పాటు చేయటంతోపాటు 24 గంటలు పంచాక్షరీ మంత్రం వినిపించేలా మైక్ సౌండ్ సిస్టమ్ పంచాయతీ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామన్నారు. కృష్ణానది స్నానఘట్లతోపాటు దుర్గానాగేశ్వరస్వామి దేవాలయానికి భక్తులు విచ్చేస్తుండటంతో ఏ విధమైన అసాంఘిక కార్యక్రమాలకు తావు లేకుండా బందోబస్తు నిర్వహించనున్నట్లు ఎస్సై తెలిపారు. పెదకళ్లేపల్లి నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు గొర్రెపాటి దుర్గానాగేశ్వరరావు, గ్రామస్థులు అరజా కిర ణ్ కాంత్, చొడగం రాధాకృష్ణ తదితరులు ఉన్నారు.

పర్యాటకులు మెరైన్ పోలీసుల సూచనలు పాటించాలి

కోడూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : హంసలదీవి శివారు పాలకాయితిప్ప బీచ్ వద్దకు వచ్చే పర్యాటకులు మెరైన్ పోలీసుల సూచనలను పాటించాలని మెరైన్ ఎస్సై పూర్ణ మాధురి తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి పాలకాయితిప్ప బీచ్ వద్దకు పర్యాటకులు విచ్చేసి స్నానాలు చేసి సరదాగా గడిపారు. పర్యాటకులకు మెరైన్ సిబ్బంది పలు సూచనలు అందించారు. సముద్ర తీరం వెంబడి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గస్తీ నిర్వహించారు.

అవినీతి రహితంగా ఉపాధి పనులు

మోపిదేవి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : అవినీతికి ఆస్కారం లేకుండా ఉపాధి పనులు సమర్థవంతంగా నిర్వహించేందుకే సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ సూర్యచక్ర తెలిపారు. బొబ్బర్లంక, పెదప్రోలు, కోసూరువారిపాలెం, మోపిదేవి గ్రామా ల్లో ఆదివారం సామాజిక తనిఖీ గ్రామసభలు జరిగాయి. సర్పంచ్‌లు దొప్పలపూడి గంగాభాని, పోలిమెట్ల ఏసుబాబు, కోసూరు అనూష, నందిగం మేరీ రాణిల అధ్యక్షతన గ్రామసభలు జరిగాయి. డీఆర్పీలు కోటేశ్వరరావు, నాగార్జునలు సామాజిక తనిఖీ నివేదికలను వెల్లడి చేశారు. పనులు చేయకుండానే మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు మస్టర్లు వేసి నగదును పంచుకుంటున్నట్లు మోపిదేవి గ్రామసభలో ఉపాధి శ్రామికులు ఆరోపించారు. పనులు సక్రమంగా నిర్వహించేలా చూడాల్సిందిగా ఎంపీపీ రావి దుర్గావాణి అన్నారు. పంచాయతీ కార్యదర్శులు విజయలక్ష్మి, రామకోటేశ్వరరావు, మల్లేశ్వరరావు, పి.కోటేశ్వరరావులు పాల్గొన్నారు.



మాదక ద్రవ్యాల నిరోధంపై రిటైర్డ్ డీఎస్పీ బాబ్జీ రాసిన పుస్తకాలతో పోలీసులు

ఒత్తిడిని అధిగమించేందుకు శ్రద్ధ చూపాలి

అవనిగడ్డ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఒత్తిడిని అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ తగిన శ్రద్ధ చూపాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, రిటైర్డ్ డీఎస్పీ బాబ్జీ అన్నారు. స్థానిక ఏఎస్ఆర్ కల్యాణ మండపంలో మాదక ద్రవ్యాల వినియోగానికి కారణాలు, వాటి వల్ల వచ్చే అనర్థాలపై సబ్ డివిజన్‌లోని పోలీసులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. పిల్లలను తలిదండ్రులు గమనిస్తూ తప్పుదారి పట్టకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసలైన వారిని ఎలా గుర్తించాలి, వారిని వాటి నుంచి ఎలా దూరం చేయాలో బాబ్జీ అవగాహన కల్పించారు. సీఐ యువకుమార్, ఎస్సై శ్రీనివాస్, సబ్ డివిజన్ పోలీసులు పాల్గొన్నారు. యువతను మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంచేలా బాబ్జీ రచించిన పుస్తకాన్ని సబ్ డివిజన్ పోలీసులకు అందజేశారు.

అన్న క్యాంటీన్ పూర్తి చేయరూ..!!

• గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు
• భవన నిర్మాణం మూడొంతులు పూర్తి
• వైసీపీ ప్రభుత్వంలో నిలిచిపోయిన పనులు
• త్వరలో పూర్తి చేసి ప్రారంభించాలని పేద ప్రజలు, కార్మికుల వేడుకోలు



చల్లపల్లిలో అన్న క్యాంటీన్ కోసం నిర్మించిన భవనం, మూడొంతులు పూర్తయిన పనులు

చల్లపల్లిలో అన్న క్యాంటీన్ భవనం అసంపూర్తిగా ఉంది. మూడొంతుల నిర్మాణం పూర్తయ్యింది. నిర్మాణం పూర్తి చేసి ఎప్పుడు అందుబాటులోకి తీసుకొస్తారా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించిన అనంతరం చేసిన ఐదు సంతకాల్లో అన్న క్యాంటీన్ పునరుద్ధరణ ఒకటి కావటంతో ప్రజల్లో సంతోషం వ్యక్తమైంది.

(ఆంధ్రజ్యోతి-చల్లపల్లి)

నవ్యాంధ్ర ప్రదేశ్ ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. 2019లో జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్ల పథకాన్ని రద్దుచేయటంతో అప్పటికే కొనసాగుతున్న క్యాంటీన్‌లు మూతపడ్డాయి. కొత్తగా మంజూ రైన ప్రాంతాల్లో ప్రయత్నాలు నిలిచిపోయాయి. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం, ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాలుగో సంతకంగా పునరుద్ధర ణకు నిర్ణయం తీసుకోవటంతో మళ్లీ క్యాంటీన్లు ప్రారంభిస్తారనే ఆశ ప్రజల్లో చిగురించింది.అవనిగడ్డ నియోజకవర్గ ముఖద్వారమైన చల్లపల్లిలో అన్న క్యాంటీన్‌ను నవ్యాంధ్ర తొలి టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ ఉత్తర్వులు ఇవ్వగా, గ్రామం లో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు చల్లపల్లి మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో స్థలం అనువైనదిగా ఎంపిక చేశారు. ఐదు సెంట్ల స్థలాన్ని అన్న క్యాంటీన్‌కు కేటాయిస్తూ తీర్మానం చేశారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో భవన నిర్మాణం సైతం ప్రారంభమైంది. దాదాపుగా మూడొంతుల నిర్మాణం పూర్తి కావటంతోపాటు పెయింటింగ్ పనులు, పైపులైను పనులు, ఎలివేషన్ కోసం అల్యూమినియం పైపుల ఫిట్టింగ్ సైతం జరిగింది. మురుగుకాల్వపై కల్వర్టుగానీ నిర్మించి అన్న క్యాంటీన్‌కు వెళ్లేలా మార్గం ఏర్పాటు చేయాల్సి ఉంది. 2019లో జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వం మారటం, వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లు రద్దు చేయటంతో పనులు ముందుకుసాగలేదు. చల్లపల్లి కూడలి గ్రామం కావటంతో అన్న క్యాంటీన్ ఆవశ్యకత ఉంది. వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ నిర్మాణ కార్మికులు, రోడ్లవెంబడి జీవించే నిరుపేద వర్గాలు, ప్రభుత్వాసుపత్రికి వచ్చే గ్రామీణ పేద లు ఇలా ప్రజానీకం అన్న క్యాంటీన్‌ను ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. అన్న క్యాంటీన్ నిర్వహించేందుకు మిగిలి ఉన్న పనులను పూర్తిచేసి ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. మొదటి విడతలో ప్రారంభించకపోవటంతో రెండవ విడతలో అయినా ప్రారంభిస్తారా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.



శివరాం సంతాప సభలో మాట్లాడుతున్న డాక్టర్ ధన్వంతరీ ఆచార్య

న్యాయవాది శివరాం సేవలు స్ఫూర్తిదాయకం

మచిలీపట్నం టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ న్యాయవాది వింజమూరి శివరాం సేవలు స్ఫూర్తిదాయకమని డాక్టర్ బి. ధన్వంతరీ ఆచార్య అన్నారు. బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో చిత్రకళా సంసద్‌లో ఆదివారం ప్రముఖ న్యాయవాది వింజమూరి శివరాం సంతాప సభ జరిగింది. ఈ సభలో పలువురు వక్తలు వింజమూరి శివరాం సేవలను కొనియాడారు. డాక్టర్ బి. ధన్వంతరీ ఆచార్య మాట్లాడుతూ, శివరాం న్యాయ సేవలతో పాటు సామాజిక, సాహిత్య ధార్మిక సేవలందించారన్నారు. త్రిపుర సుందరీ ఫౌండేషన్ ద్వారా వేలాది రోగులను, పేద విద్యార్థులను ఆదుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సారంగపాణి, సింగరాజు గోవర్ధన్, పి.వి. ఫణికుమార్, జె. సేతురామయ్య, మారుతీ దివాకర్, భవిష్య, మోపర్తి సుబ్రహ్మణ్యం, పోతురాజు శర్మ, వింజమూరి సుబ్బారావు, వెణుతురుమిల్లి సత్యనారాయణ, ఎం.వి.శ్రీరామచంద్రమూర్తి, ఎం. కామశాస్త్రి, పి. కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో విజేత యంగర్స్ బందరు జట్టు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు

మచిలీపట్నం టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : బందరు మండలం సింహాచలం గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంటులో యంగర్స్ బందరు జట్టు ప్రథమ బహుమతి గెలుచుకుంది. విజేతలకు మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు ప్రథమ బహుమతి రూ. 10 వేలు అందజేశారు. ద్వితీయ బహుమతి రూ. 7వేలు సింహాచలం జట్టుకు మోగంటి ధ్యానయ్య, మూడవ స్థానంలో నిలిచిన పెదకళ్లేపల్లి జట్టుకు రూ. 5 వేలు కుంచనపల్లి సురేష్ అందజేశారు. వి. కుమార్‌రాజా, ప్రసన్న, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పోర్టు ఆధారిత పరిశ్రమలపై దృష్టి సారించాలి : సీపీఎం

మచిలీపట్నం టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం పోర్టు ఆధారిత పరిశ్రమలపై దృష్టి సారించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు డిమాండ్ చేశారు. బుట్టాయిపేటలోని సీపీఎం కార్యాలయంలో దారి తప్పుతున్న కూటమి ఏడాది పాలన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. మచిలీపట్నానికి పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామనే హామీని కూటమి నాయకులు ఇంత వరకు నెరవేరలేదన్నారు. రెండు వేల మందికి ఉపాధి కల్పించే భారత్ సాల్ట్ పరిశ్రమ మూతపడిందన్నారు. జ్యూయలరీ పార్కు విస్తరించి నైపుణ్యాలను మెరుగుపరిచే విధంగా శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. చేనేత క్లస్టర్ స్కీమ్ జాడ లేదన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శీలం నారాయణరావు, మచిలీపట్నం కార్యదర్శి బి. సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసిన బండి రామకృష్ణ

మంత్రి నాదెండ్లకు రామకృష్ణ ఆహ్వానం

మచిలీపట్నం టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : డీసీఎంఎస్ చైర్మన్‌గా ఈనెల 18వ తేదీ సాయంత్రం మచిలీపట్నం సత్య కన్వెన్షన్ హాలులో ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు బండి రామకృష్ణ తెలిపారు. ప్రమాణస్వీకారోత్సవానికి విచ్చేయాల్సిందిగా మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేసినట్లు ఆయన తెలిపారు.

కృష్ణానదిలో ఎలక్ట్రీషియన్ గల్లంతు



ఫణికుమార్

ఘంటసాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో యువకుడు గల్లంతైన సంఘటన ఆదివారం మధ్యాహ్నం శ్రీకాకుళంలో జరిగింది. ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే ఆత్కూరి ఫణికుమార్ (25) శ్రీకాకుళం సమీపంలోని కృష్ణానదికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి పడి గల్లంతయ్యాడు. స్థానికులు కృష్ణానదిలో గాలింపు చర్యలు చేపట్టారు. పొద్దుపోయే వరకు గాలించినప్పటికీ ఫణికుమార్ ఆచూకీ లభించలేదు. స్థానికులు రెవెన్యూ, పోలీసులకు సమాచారం అందించారు.

లోకేశ్‌పై జగన్ వ్యాఖ్యలకు వేదవ్యాస్ ఖండన

మచిలీపట్నం టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనం పథకం ద్వారా తల్లుల ఖాతాల్లో కూటమి ప్రభుత్వం డబ్బులు జమ చేస్తుంటే వైసీపీ నాయకులు ఇష్టారాజ్యంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌పై అవాకులు చవాకులు పేలడాన్ని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ ఖండించారు. వైసీపీ 11 సీట్లకే పరిమితం చేసి రాష్ట్ర ప్రజలు తరిమి కొట్టినా జగన్‌కు బుద్ధిరాలేదన్నారు. ఇకనైనా దుష్ప్రచారాలకు స్వస్తిపలకాలని హితవు పలికారు.



హోమం చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర దంపతులు

రామాలయంలో నారాయణ హోమం

మచిలీపట్నం టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : బందరుకోటలోని కోదండ రామాలయంలో ఆదివారం వైభవంగా నారాయణ హోమం నిర్వహించారు. మంత్రి కొల్లు రవీంద్ర, నీలిమ దంపతులు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రాగణంలో వార్షికోత్సవాలు, రాతి గాలిగోపురం నిర్మాణం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. వేదపండితుల వేద ఘోషతో ఆలయం ప్రతిధ్వనించింది. ఈ కార్యక్రమంలో గోపు సత్యనారాయణ, కుంచే నాని, లంకిశెట్టి నీరజ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటాలంటూ ర్యాలీ

మచిలీపట్నం టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటాలని కోరుతూ సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు ఉస్మాన్ బాషా మాట్లాడుతూ అందరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. చిన్నాపురం డాక్టర్ లక్ష్మణస్వామి వితరణతో హిందూ కళాశాల ప్రాంగణంలో జూలై 13న 50 వేల మొక్కలు పంపిణీ చేస్తామన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



అవనిగడ్డ రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పులిగడ్డ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శాంతి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని సత్య కృష్ణమాచార్య, విఖనసల ఆధ్వర్యంలో స్వామివారి శాంతి కల్యాణం జరిపారు. భక్తులు కల్యాణం తిలరించి తరించారు. మండలి భావన్నారాయణ ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది.

అంకమ్మ నెల జాతర

అవనిగడ్డ రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డలో అంకమ్మ తల్లి నెల సంబరం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. మాజీ సర్పంచ్ చెన్ను గాంధీ, గ్రామ ప్రముఖులు పర్యవేక్షించారు.

సూర్యనారాయణ స్వామి శాంతి కల్యాణం

అవనిగడ్డ రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : వేకనూరులో సూర్యనారాయణ స్వామి శాంతి కల్యాణం ఆదివారం కాశీభొట్ల రాజశేఖర శర్మ ఆధ్వర్యంలో కోసూరు పూర్ణచంద్రరావు దంపతులు నిర్వహించారు. దీవి నరసింహమూర్తి విశేష అలంకారం చేశారు. చందన రోషి కిరణ్ కుమార్ ఆర్థిక సహకారంతో అన్నదానం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తుంగల వీరవసంతరావు - ఇందిరాదేవి పర్యవేక్షించారు.

గంగానమ్మ నెల సంబరం



నాగాయలంక, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నాగాయలంకలో తలశిల వారి ఇలవేల్పు గంగానమ్మ అమ్మవారి నెల జాతర మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిపారు. భక్తులు విరివిగా తరలి వచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలను పంచి పెట్టారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ పర్యవేక్షించారు.



ముగిసిన ఊర్వేళమ్మ జాతర

నాగాయలంక, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : గత మూడు రోజులుగా భావదేవరపల్లిలో జరుగుతున్న ఊర్వేళమ్మ జాతర ఆదివారం వైభవంగా ముగిసింది. ముగింపు రోజున సనాతన ధర్మ పరిషత్ ఆధ్వర్యంలో కేరళ సంప్రదాయ చండీమేళంతో జాతరను నిర్వహించారు. అవనిగడ్డ సీఐ యువకుమార్, సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, తుటారం చక్రవర్తి, భోగాది సాయికుమార్, మండలి రాజేష్, ముమ్మారెడ్డి సాంబశివరావు తదితరులు పాల్గొనగా, ఆలయ ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు పర్యవేక్షించారు.

హనుమత్ ఉపాసనతో విజయాలు

మచిలీపట్నం టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : హనుమత్ ఉపాసన వల్ల విజయాలు సులభమవుతాయని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త అన్నదానం చిదంబర శాస్త్రి అన్నారు. బచ్చుపేటలోని ఆంజనేయ స్వామి వారి దేవాలయం వద్ద ఆయన మాట్లాడారు. హనుమంతుని ఉపాసిస్తే ఏపనైనా పూర్తవుతుందన్నారు. అయోధ్య ప్రతిష్ఠకు ఆరు కోట్ల రామమంత్రాన్ని జపించామన్నారు.

వలందపాలెం ఈద్గా వద్ద ఉచిత వైద్యశిబిరం

మచిలీపట్నం టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం వలందపాలెం ఈద్గా వద్ద దివ్య ల్యాబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. 200 మందికి రక్త పరీక్షలు, వైద్యపరీక్షలు చేశారు. సంఘం అధ్యక్షుడు మహమ్మద్ దాదా సాహెబ్, ఉపాధ్యక్షుడు నాగుల్‌మీరా, కార్యదర్శి ఎండి అబూ, మహమ్మద్ సిద్ధిఖ్, దివ్య ల్యాబ్ రాంబాబు, సలీం, అబ్దుల్ రఫీ పాల్గొన్నారు.



కొండాలమ్మ ఆలయం కిటకిట

గుడ్లవల్లేరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. దాదాపు 25000 మంది అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారని ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. క్యూలైన్లలోని భక్తులకు తాగునీరు, మజ్జిగ దేవస్థానం ఆధ్వర్యంలో పంపిణీ చేశామన్నారు.